ప్రజాశక్తి

శుక్రవారం 13 డిసెంబర్ 2024 8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

ఇసుక తరలిపోతోంది

- నందిగామ, జగ్గయ్యపేట నుంచి అక్రమ రవాణా
- తెలంగాణకు రోజూ పదుల సంఖ్యలో లారీలు
- అధికార పార్టీ ప్రజాప్రతినిధి కనుసన్నల్లో తవ్వకాలు?
- చెక్‌పోస్టుల వద్ద కొరవడిన నిఘా






చిల్లకల్లు వద్ద పట్టుబడిన లారీలు

ప్రజాశక్తి-కంచికచర్ల

ఉచిత ఇసుక విధానం మాటున ఎన్టీఆర్ జిల్లాలో పగలు రాత్రి తేడా లేకుండా ఒక పక్క కృష్ణానది, మరోపక్క మునేరుల నుండి ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల నుండి ప్రతిరోజు పదుల సంఖ్యలో లారీల ఇసుక తెలంగాణా రాష్ట్రానికి తరలిపోతోంది. దొరికితే దొంగ... లేకపోతే కాసుల పంట అన్న చందంగా ఉంది. చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన ప్రభుత్వ పెద్దలే ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇసుక అక్రమ రవాణా చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని బహిరంగ హెచ్చరికలు చేసినా ఆయన ప్రభుత్వంలో ఉన్న కీలక ప్రజాప్రతినిధులు బేఖాతరు చేస్తూ ఇసుక అక్రమ రవాణాదారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇసుక అక్రమ రవాణా కాదు కదా అంతరాష్ట్ర రవాణాకు అనుమతులు లేకపోయినా ప్రతిరోజు తెలంగాణాకు పదుల సంఖ్యలో ఇసుక అక్రమ రవాణా (మిగతా 2లో)



కాసరబాద క్వారీ

జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం



వార్త 8లో

ముప్పాళ్ల పంచాయతీకి పురస్కారం

ప్రజాశక్తి-నందిగామ : దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సత్ వికాస్ పురస్కారాలకు ఎంపికైన పంచాయతీలకు బుధవారం ఢిల్లీలో అవార్డులను ప్రదానం చేశారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ పంచాయతీ (తాగునీటి సరఫరా, పచ్చదనం, పరిశుభ్రత విభాగం) ఎంపికైంది. ముప్పాళ్ల పంచాయతీ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, పంచాయతీ కార్యదర్శి సాయిరామ్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి నాయకులు సెగ్మెంట్ రవి తదితరులు హాజరయ్యారు.



పురస్కారం అందుకుంటున్న సర్పంచ్, కార్యదర్శి

రాజధాని రైతులకు ప్లాట్లు కేటాయింపు



ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేస్తున్న రాజకుమారి

ప్రజాశక్తి-విజయవాడ

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్డీఏ)కు భూ సమీకరణ పథకంలో భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్ల ఈ లాటరీ కార్యక్రమం గురువారం విజయవాడ ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ప్రత్యామ్నాయ రిటర్నబుల్ ప్లాట్లు పొందిన రైతులకు సౌకర్యవంతంగా అమరావతిలో ప్రభుత్వం తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఏపీ సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బి.ఎల్.ఎస్.రాజకుమారి తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజినల్ సర్టిఫికెట్లు అందుకున్న వారం రోజుల్లోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రైతులు రిజిస్ట్రేషన్ క్రతువును పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ లాటరీకి హాజరైన రైతులకు ల్యాండ్స్ డైరెక్టర్ నేతృత్వంలో ఆన్లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా నివాస, వాణిజ్య ప్లాట్లకు తొలుత ట్రైల్ రన్ వేసి తరువాత ప్రత్యక్ష లాటరీ ప్రక్రియను చేపట్టామన్నార. ఈ లాటరీలో ప్లాట్లు పొందిన రైతులకు భౌగోళికంగా వారి ప్లాట్లు ఎక్కడా కేటాయించబడ్డాయో వివరించడానికి ప్రత్యేకంగా గ్రామ సర్వేయర్లను నియమించామని చెప్పారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్షియల్ 130, కమర్షియల్ 113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఆర్డీఏ ఆఫీస్ మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జి.భీమారావు, కె.స్వర్ణమేరి, బి.సాయి శ్రీనివాసనాయక్, పి.పద్మావతి, డి.హుస్సేన్ సాహెబ్, కె.ఎస్.భాగ్యరేఖ, జి. రవీందర్, ప్రిన్సిపల్ ప్లానర్ ఆర్.నాగేశ్వరరావు, తహసీల్దార్ అరుణాదేవి పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర @ 2047కు అంతా సిద్ధం

- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి
- ఐఎఎస్ అధికారుల సారథ్యంలో ప్రత్యేక బృందాలు



మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఏర్పాట్ల గురించి వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రజాశక్తి-విజయవాడ

ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనందం (వెల్తీ, హెల్తీ, హ్యాపీ) శోభిత ఆంధ్రప్రదేశ్ సాకారం లక్ష్యంగా స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 13వ తేదీ శుక్రవారం విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో జరగనుంది. దీనికి సంబంధించి ఐఎఎస్ అధికారుల సారథ్యంలో ప్రత్యేక బందాలు పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. 26 జిల్లాల నుంచి అతిథులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. విద్య, మహిళా సాధికారత, టెక్నాలజీ, ఆరోగ్యం, వ్యవసాయం, స్వచ్ఛంద సేవ ఇలా వివిధ విభాగాల్లో విశేష సేవలందిస్తున్న వారూ ప్రత్యేక ఆహ్వానితులుగా కార్యక్రమంలో పాల్గొంటారు. 500 బస్సుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రానున్నారు. దాదాపు 30 వేల మంది కార్యక్రమానికి హాజరవుతారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల అధికారులతో సమన్వయానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 500 బస్సులతో పాటు కార్లకు అవసరమైన 24 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. బస్సుల కోసం ప్రత్యేకంగా ఏడు పార్కింగ్ ప్రాంతాలను సిద్ధం చేశారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా వివిధ రకాల పాస్‌లను జారీ చేశారు. వివిఐపీ, వీఐపీ, పబ్లిక్ తదితర గ్యాలరీకు ఇన్‌ఛార్జ్‌లను నియమించారు. ప్రతి గ్యాలరీకి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు బృందాలు ఏర్పాటు చేశారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్, ఎల్ఈడీ భారీ తెరలను సిద్ధం చేశారు. విజన్ డాక్యుమెంట్‌ను ప్రతిబింబించేలా పది ఇతివృత్తాలతో ప్రదర్శనలు కార్యక్రమంలో భాగం కానున్నాయి. మునిసిపల్ స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం రాత్రి పరిశీలించారు. విజన్ డాక్యుమెంట్ ప్రజంటేషన్, స్టాళ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, (మిగతా 2లో)

వసతుల ఏర్పాటులో లోపాలకు తావివ్వొద్దు

అధికారులకు కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం

ప్రజాశక్తి-విజయవాడ
ఈ నెల 13న శుక్రవారం విజయవాడలో జరిగే స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ నుంచి ఏర్పాట్లలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ కార్యక్రమం నిర్వహణలో భాగంగా వివిధ శాఖల సమన్వయంతో జరుగుతున్న కార్యక్రమాల ఏర్పాట్లలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉండేటట్లు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ ప్రసాద్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రామ కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





సిద్ధార్థ కళాశాలలో సాహిత్య పోటీలు

విజయవాడ: విద్యార్థులు ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని, అభివ్యక్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితాప్రసాద్ అన్నారు. గురువారం విజయవాడలోని సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆంగ్ల విభాగం నేతృత్వంలో లీమస్-2కె24 రాష్ట్రస్థాయి సాహిత్య పోటీలను ఆయన ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. మేకా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అంది పుచ్చుకోవాలన్నారు. డీన్ రాజేష్ .పి. జంపాల మాట్లాడుతూ విద్యార్థుల సాహితీ ప్రతిభను ఈ తరహా పోటీలు వెలికితీస్తాయన్నారు. ఆంగ్ల విభాగాధిపతి డా. జి.శ్రీలత కార్యక్రమం పర్యవేక్షించారు.

సహకారం రంగం పటిష్టంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ సివిల్‌కోర్టు బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ నూతన సభ్యుల నియామక కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి సొసైటీ ఛైర్‌పర్సన్ సంపర దుర్గాశ్రీనివాసరావు అధ్యక్షత వహించగా విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ సత్యానంద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేడు సహకార రంగం పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. న్యాయవాదులు, గుమస్తాల, అభివృద్ధికి, వారి అవసరాలకు ఈ సొసైటీ కృషి చేయాలని కోరారు. సహకార సొసైటీలకు మూలం సభ్యుల మధ్య సహకారం, నిబద్ధత, పారదర్శకత అవసరమన్నారు. సభ్యుల ఆకాంక్షలతో నిజాయితీగా పాలకవర్గ సభ్యులు పని చేయాలన్నారు. ప్రస్తుత ఈనాడు చాలా సహకార సంఘాలు ఈ లక్షణాలు లేక మూలనపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ న్యాయవాదుల కోఆపరేటివ్ సొసైటీ ఈ విషయాలను గమనంలోకి తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్, చలసాని అజయ్‌కుమార్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె చంద్రమౌళి, ఎ.రాజ పాల్గొన్నారు.



14న గ్రంథాలయ పునర్వికాస ప్రదర్శన, సదస్సు

విజయవాడ: విజయవాడలో ఈ నెల 13న శుక్రవారం ఉదయం జరగాల్సిన గ్రంథాలయాల పునర్వికాస ప్రదర్శన, సదస్సు పోలీసు అనుమతి రద్దు చేసినందున 14వ తేదీ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కన్వీనర్ వల్లూరు శివప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 గంటలకు తుమ్మలపల్లి కళాక్షేత్రం తెలుగు తల్లి విగ్రహం నుండి లెనిన్ విగ్రహం గవర్నర్‌పేట వరకు ప్రదర్శన, అనంతరం సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మార్పును గమనించి రచయితలు, ప్రచురణకర్తలు, పుస్తకప్రియులు, గ్రంథాలయ అభిమానులు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎయిర్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ గ్లోబల్ ఎయిర్‌లైన్ ఎయిర్ ఇండియా్యు అతిథులకు అంతరాయం లేని వినోదాన్ని అందిస్తూ తమ వైర్‌లెస్ ఇన్‌ఫ్లైట్ ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీస్ అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి పి.రామ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అప్‌డేట్‌తో విస్తా స్ట్రీమ్ ఇప్పుడు అంతర్జాతీయ, దేశీయ నెట్‌వర్క్‌లో వైడ్‌బాడీ, నారోబాడీ ఎయిర్‌క్రాఫ్ట్ రెండింటిలోనూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విస్తా స్ట్రీమ్ అతిథులు తమ వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలైన స్మార్ట్ ఫోన్‌లు, టాబ్లెట్‌లు, ల్యాప్‌టాప్‌లకు నేరుగా అనేక రకాల కంటెంట్‌ను ప్రసారం చేయడానికి అనుమతిస్తుందన్నారు.

మొదటిపేజీ తరువాయి

స్వర్ణాంధ్ర @ 2047కు అంతా సిద్ధం

తాగునీటి సరఫరా, అల్పాహారం, పారిశుధ్యం, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను గురువారం మునిసిపల్ మైదానంలో రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెర్ప్ సీఈవో జి.వీరపాండ్యన్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, ఐ అండ్ పిఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా తదితర రాష్ట్రస్థాయి అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా, పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా చేయడానికి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

స్వర్ణాంధ్ర విజన్‌కు పటిష్ట బందోబస్తు : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటున్న నేపథ్యంలో శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు , ఇతర పోలీసు అధికారులతో కలిసి పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో బందోబస్త్ విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు అధికారులతో బందోబస్త్ నిర్వహణపై కూలంకుషంగా చర్చించారు. అనంతరం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం నందు పోలీస్ అధికారులు మరియు సిబ్బందితో పాటు అన్ని శాఖల అధికారులు మరియు సిబ్బందితో కలిపి సమావేశం ఏర్పాటు చేసి స్వర్ణాంధ్ర @ 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ గారు సిబ్బందితో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఎంపిలు, మంత్రులు, ఇతర విఐపిలు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారన్నారు. బందోబస్తులో పాల్గొనే అధికారులు , సిబ్బంది వారికి కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో బందోబస్త్ నిర్వహించాలని, అదేవిధంగా పోలీసు సిబ్బంది వారికి కేటాయించిన పాయింట్లలో అప్రమత్తంగా ఉండాలన్నారు. స్టేడియం లోపలకు వచ్చేవారిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆ తరువాత మాత్రమే సభ ప్రాంగణం లోనికి అనుమతించాలని, అదేవిధంగా ముఖ్య ప్రాంతాలలో మరియు ముఖ్య జంక్షన్ లలో ఎక్కడా ట్రాఫిక్ అంతరాయాలు కలుగకుండా ఉండేందుకు సిబ్బందిని అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ పర్యవేక్షించాలని కోరారు.

ఇసుక తరలిపోతోంది

జరుగుతుందంటే సంబంధిత అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అధికార పార్టీకి చెందిన కిందిస్థాయి నాయకులే అంటున్నారు.

ఆరు లారీలు సీజ్

చందర్లపాడు మండలం నుండి తెలంగాణా ఓవర్ లోడుతో ఇసుక రవాణా చేయటానికి సిద్ధంగా ఉన్న ఆరు లారీలను చిల్లకల్లు వద్ద పోలీసులు పట్టుకున్నారు. గురువారం తెల్లవారుజామున చందర్లపాడు మండలంలో ఇసుక లోడ్ చేసుకొని తెలంగాణా వెళ్లే ఆరు లారీలు చిల్లకల్లు దాటాక జాతీయ రహదారి పక్కన పెట్రోలు బంకులో ఆపారు. ఆంధ్ర బోర్డర్ దాటి తెలంగాణా వెళ్లేందుకు గరికపాడు బోర్డర్ చెక్‌పోస్టు నుండి క్లియరెన్స్ కోసం లారీ డ్రైవర్లు నిరీక్షిస్తున్నారు. ఈ సమయంలో చిల్లకల్లు ఎస్సై సూర్య శ్రీనివాస్‌కు సమాచారం రావటంతో ఆయన సిబ్బందితో కలిసి లారీల వద్దకు వెళ్లి లోడు పరిశీలించారు. ఓవర్ లోడుతో తెలంగాణాకు ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. తర్వాత లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

కీలక నేత కనుసన్నల్లో...

ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన జిల్లాస్థాయి ఓ కీలక ప్రజాప్రతినిధి కనుసన్నల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. కాసరబాద, శనగపాడు, కొల్లికుళ్ల, అనిగండ్లపాడు, అల్లూరుపాడు, మల్కాపురం, ఇందుగుపల్లి, తదితర క్వారీలు నడుస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో లారీకి 20 టన్నులకు 2800 ఆన్లైన్‌లో డబ్బులు చెల్లించిన లారీకి ఇసుక లోడ్ చేయాలి. ఇంతవరకు బాగానే ఉంది. కొన్ని లారీలకు 2800 ఆన్లైన్‌లో చెల్లించినా అదనంగా మరో 7200 తీసుకొని ఇసుక లోడ్ చేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన కీలక నాయకుడి పేరుతో వందలాది వాహనాలకు అసలు ఎలాంటి నగదు లేకుండా ఏకంగా 40 టన్నుల వరకు ఓవర్ లోడ్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో వందలాది లారీల్లో తెలంగాణాకు ఇసుక లారీలు యథేచ్ఛగా రవాణా అవుతున్నాయి. ఈ రెండు నియోజకవర్గాల్లోని ఇసుక క్వారీల నుండి ప్రతిరోజు లారీల నుండి అదనంగా వసూలు చేసిన సొమ్ము లక్షలకు పైగానే ఉంటుందని, ఆ సొమ్ము అంతా ఆయా నియోజకవరాగాల్లోని కీలక నాయకులకు కొంత ముట్టజెప్పి, మిగతాదంతా క్వారీలపై పెత్తనం చెలాయిస్తున్న కీలక ప్రజాప్రతినిధి జేబులోకి వెళ్తున్నాయని ఆ పార్టీ కార్యకర్తలే అంటున్నారు. ఇవికాక ప్రతిరోజూ రాత్రి సమయాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణాకు ఇసుక రవాణా చేస్తున్న లారీల నుండి లక్షల్లోనే ఆదాయం ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇసుక దోపిడీపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై వేధింపుల పరంపర మొదలౌతుందని అధికార పార్టీ కార్యకర్తలే వాపోతున్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో క్వారీ గుత్తేదారులు కొందరైతే, ఆ క్వారీలపై పెత్తనం మాత్రం అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధి, అతని అనుచరులదేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?

ఇసుక అక్రమ రవాణా అరికట్టటానికి జిల్లా పోలీసు అధికారుల ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ పనితీరుపై సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. మొదట్లో టాస్క్ ఫోర్స్ పేరుతో జిల్లా వ్యాప్తంగా టీంలూ, డ్రోన్లు అని కొద్దిగా హడావుడి చేశారని, తర్వాత అధికార పార్టీ కీలక ప్రజాప్రతినిధి చేతిలో టాస్క్‌ఫోర్స్ కీలుబొమ్మగా మారిందని కార్యకర్తలు విమర్శిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంటే ప్రతిరోజూ పగలూ రాత్రీ తేడా లేకుండా జగ్గయ్యపేట వద్ద గరికపాడు చెక్ పోస్టు దాటి తెలంగాణాకు ఇసుక లారీలు ఎలా వెళ్తాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇసుక వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా, బాధ్యత, జవాబుదారీగా ఉండి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఉచిత ఇసుక విధానం సక్రమంగా అమలయ్యేలా చూసి ప్రజల మన్ననలు పొందాలని, అధికారులు సైతం ఇసుక అక్రమ రవాణా నివారణకు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు : ఆర్‌డిఒ

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని నందిగామ ఆర్డీఓ బాలకృష్ణ తెలిపారు. నిబంధనల ప్రకారం ఆన్లైన్లో బుక్ చేసుకున్న వారికే ఇసుక లోడింగ్ చేస్తున్నారన్నారు. ఇసుక లోడింగ్ వద్ద వినియోగదారుల నుండి అదనంగా వసూలు చేసే విషయం తమ దృష్టికి రాలేదని, ఈ విషయంపై నిఘా పెడతామన్నారు. తెలంగాణాకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా 16 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.



రోడ్డు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ, తదితరులు

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : వెనిగండ్ల

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. మండల కేంద్రమైన గుడ్లవల్లేరులో రూ.52 లక్షల నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న పోల్‌రాజ్ కెనాల్ గట్టు రోడ్డును ఏపీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడుతూగ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివద్ధి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుడివాడ జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బిజెపి కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, మండల టిడిపి అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి,ఎంపీడీవో సారధి, మండల టిడిపి నాయకులు సాయన పుష్పావతి, వల్లభనేని వెంకట్రావు పాల్గొన్నారు.

అదానీతో ఒప్పందాలను రద్దు చేయాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ఆదానితో చేసుకున్న ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక నెహ్రూచౌక్‌లో సిపిఎం నాయకులు విద్యుత్తు బిల్లులు దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు గత నెలలో వచ్చిన దానికి రెట్టింపుగా ఈ నెలలో విద్యుత్ ఛార్జీలు వస్తున్నాయన్నారు. అంతే కాకుండా ఇంకా రాబోయే నెలలో ఇంకా పెరిగే పరిస్థితి ఉంద న్నారు. చంద్రబాబునాయుడు ఆయన అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే సుమారు 15 వేల కోట్ల రూపాయలు ప్రజల మీద భారాన్ని మోపిన పరిస్థితి ఉందన్నారు. కాబట్టి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికార పక్షంలో ఉన్నప్పుడు ఒక మాట కాదని కూటమి ప్రభుత్వం మాటమీద నిలబడా లన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సింగవరపు రాంబాబు, సిపిఎం నాయకులు ఆలూరు విజయ కుమార్, ఎల్ సురేంద్ర, పి రజిని, ఆర్ కొండ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కృష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్.విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు తమ దిమాండ్స్ పరిష్కరించాలని గత ఏడాది డిసెంబర్ 12 వ తేదీన అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు కష్ణాజిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమ్మె ప్రారంభించి 42 రోజుల పాటు చేశామని, సమ్మెతో దిగొచ్చిన ప్రభుత్వం కొన్ని డిమాండ్ పరిష్కారానికి రాత పూర్వక హామీ ఇచ్చిందని అదికూడా ఉన్నతాధికారుల సమక్షంలో మినిట్స్ కూడా రాసుకోవడం జరిగిందన్నారు. మినిట్స్ రాసి ఏడాది కావస్తున్న నేటికీ అమలు నొచుకోలేదన్నారు.కాబట్టి ఇచ్చిన హామీ మేరకు వాగ్దానాలు అమలు చేయాలని లేదంటే మరో మారు సమ్మె లోకి వెళతామని



వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ కష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, జిల్లా ఉపాధ్యక్షురాలు సిహెచ్ నాంచారమ్మ, మచిలీపట్నం ప్రాజెక్టు లీడర్ పి .రజినారాణి, టి సుజాత, శ్రీలక్ష్మి లు ఉన్నారు.

ఇళ్లకు నష్టపరిహారం అందజేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల కాలంలో బుడమేరు వరదల కారణంగా నీట మునిగిన ఇళ్లకు నష్టపరిహారం రానివారికి నష్ట పరిహారం అందజేయాలని గురువారం ఆర్‌డివో కార్యాలయ ఏవో బాలాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టివి లక్ష్మణ స్వామి మాట్లాడుతూ ఉంగుటూరు మండలంలో వరద ముంపునకు గురైన ముక్కపాడు, లంకపల్లి, ఎలుకపాడు, వెల్దిపాడు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం ఇవ్వాలని అదేవిధంగా పంట పొలాలకు నష్టపరిహారం రాని వారికి నష్టపరిహారం ఇవ్వాలని, ఆయిల్ ఇంజన్లు, కరెంటు మోటార్లకు రిపేర్లకు నష్టపరిహారం అందించాలని సిపిఎం ఉంగుటూరు మండల కమిటీ తరపున కోరారు. ఈ సమస్యలపై ఆర్‌డిఓ ఏవో బాలాజీ వెంటనే స్పందిస్తూ లంకపల్లి, ముక్కపాడు గ్రామాల వారి జాబితాను కలెక్టర్‌కు పంపడం జరిగిందని, నేరుగా వారి అకౌంట్లోకి నష్టపరిహారం పంపుతారని తెలియజేశారు. మిగతా రెండు గ్రామాలకు సంబంధించి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఎటువంటి ప్రతిపాదనలో రాలేదని తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు మండల సిపిఎం కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, లంకపల్లి గ్రామస్తులు జి సంపత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ప్రజాశక్తి-బంటుమిల్లి : కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు ఐపీఎస్ సూచనల మేరకు బందరు ఎస్‌డిపిఓ మహమ్మద్ అబ్దుల్ సుభాన్, పెడన సీఐ కె. నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో బంటుమిల్లి మండలంలో భద్రతను మరింత పటిష్టం చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో, బంటుమిల్లి టౌన్‌లో స్కూల్స్, కాలేజీలు, ప్రధాన ట్రాఫిక్ జంక్షన్లు, ప్రార్ధన మందిరాలు, గ్రామాలను అనుసంధానం చేసే ప్రాంతాలను కవరుచేసేలా దాతల సహకారంతో 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాలను బంటుమిల్లి పోలీస్ స్టేషన్‌కు లింక్ చేసి పర్యవేక్షణకు అనువుగా తీర్చిదిద్దారు. సదరు సిసి కెమేరాలను గురువారం డిఎస్పీ మహమ్మద్



సిసి కెమెరాలు పరిశీలిస్తున్న డిఎస్‌పి, తదితరులు

అబ్దుల్ సుభాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ, "సీసీ కెమెరాలు సమాజ భద్రతకు ముఖ్యమైన సాధనాలు అన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ గణేష్, సిబ్బంది, దాతలు పాల్గొన్నారు.

సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మంజూరైన సిసి రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ సూచించారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి ఆర్ డి ఈ ఈ పగడాల సురేష్ బాబు సిసి రోడ్ల నిర్మాణం వివరాలు ఎమ్మెల్యేకు తెలిపారు. నియోజకవర్గంలో రూ 27 కోట్ల 15 లక్షల 45 వేలతో 43.95 కిలోమీటర్ల తో 447 సీసీ రోడ్లు మంజూరు కాగా 427 సీసీ రోడ్లు గ్రౌండింగ్ చేసి 191 రోడ్లు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. రోడ్ల నిర్మాణ దశలో ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత గ్రామమైన బొబ్బర్లంకకు మంజూరు చేసిన నూరు శాతం రోడ్ల నిర్మాణం సకాలంలో పూర్తి చేసిన అధికారులను బుద్ధ ప్రసాద అభినందిం చారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన వరద ప్రభావితం గ్రామాల్లో కూడా నూరు శాతం రోడ్లు నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈఈఈ గొప్పన శ్రీనివాసు సిహెచ్ బ్రహ్మానందబాబు వి విజయ్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు

మహాసభల కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : పోరాటాల పురిటగడ్డ మోపిదేవి మండలంలో గురువారం సిపిఎం నాయ కులు గ్రామాలలో పర్యటిం చారు. ఈనెల 15 16 17 తేదీలలో చల్లపల్లిలో జరిగే భారత కమ్యూనిస్టు (మార్క్సిస్టు) పార్టీ మహాసభలను జయప్రదం చేయాలని గ్రామస్తులను కోరారు. ఉత్తర చిరువోలుల్లంక గ్రామంలో కరపత్రం పంచుతూ ప్రచారం చేశారు. . ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మర్రాపు పోలినాయుడు, సిపిఎం మోపిదేవి మండల కార్యదర్శి బండి ఆదిశేషు, ఉత్తర చిరువోలు లంక శాఖ కార్యదర్శి దోనే సహదేవుడు, గంధం శ్రీరామచంద్రుడు, ఒడుగు గోవిందరాజులు, దోనె రోహిత్, ఒడుగు శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పెడన కౌన్సిలర్ నాగమల్లేశ్వరి మృతి



ప్రజాశక్తి-పెడన : మున్సిపల్ పరిధిలోని 14వ వార్డు కౌన్సిలర్ అనుములు నాగమల్లేశ్వరి (56) గురువారం మతి చెందారు. గత ఎన్నికలలో మున్సిపల్ పరిధి నుంచి 22 మంది టిడిపి అభ్యర్థులుగా పోటీ చేశారు. వీరిలో కేవలం నాగమల్లేశ్వరి మాత్రమే విజయం సాధించి కౌన్సిలర్గా ఎన్నికయ్యారు. నాగమల్లేశ్వరి మతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ప్రసాద్, కౌన్సిలర్లు పిచ్చుక సతీష్ బాబు, మట్ట శివనాగ పావని, పట్టణ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కూనపు రెడ్డి రంగయ్య నాయుడు, తదితరులు తదితరులు మతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

ఆటో బోల్తా : ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం రంగన్నగూడెం వద్ద ఆటో బోల్తా పడటంతో మోహన్ స్పిన్ టెక్స్ లో పనిచేసే ఏడుగురు మహిళలకు తీవ్రగాయాలకు గురైన సంఘటన గురువారం జరిగింది. తీవ్రంగా గాయపడిన మహిళలు వీరవల్లి పంచాయతీ నారాయణపురం చెందిన వారిగా గుర్తించారు. క్షతగాత్రులలో ఐదుగురి ని చిన్న అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రికి , ఇద్దరినీ విజయవాడ కామినేని ఆసుపత్రులకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసులు నమోదు

ప్రజాశక్తి-చల్లపల్లి : మండల పరిధిలోని నడకుదురు కష్ణానది రేవు నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందు కున్న చల్లపల్లి ఎస్సై పివిఎస్ సుబ్రహ్మణ్యం దాడులు నిర్వ హించి అక్రమంగా తరలిస్తున్న ఏడు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకుని చల్లపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇసుక రవాణాదారులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.



సుస్థిర అభివృద్ధి లక్ష్య సాధనపై శిక్షణ

ప్రజాశక్తి-మోపిదేవి : సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధనపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని మోపిదేవి మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు రావి దుర్గావాణి గురువారం ప్రారంభిం చారు. ఎంపీడీవో కార్యాలయంలో సుస్థిరాభివద్ధి లక్ష్యాల సాధన అంశంపై మండలంలోని వివిధ మండల స్థాయి అధికారులకు, గ్రామ సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు (గ్రేడ్ 1-6), సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అనుబంధ అధికారి కె శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ శిక్షణని ఉద్దేశించి ఎంపీడీవో జంగం స్వర్ణ భారతి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివద్ధి ప్రణాళికలను సక్రమంగా రూపొందించుకొని అమలు చేయడం ద్వారా సుస్థిరాభివద్ధి లక్ష్యాలు సాధించటం గురించి వివరించారు.
ప్రజాశక్తి-ఉయ్యూరు : సుస్థిర లక్ష్యాల సాధనపై గురువారం ఉయ్యూరు మండల పరిధిలోని కాటూరు, కలవపాముల, బోళ్ళపాడు, ముదునూరు, జబర్లపూడి, సాయిపురం, గ్రామాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బందికి మండల స్థాయి శిక్షణా నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో జి ఎస్వి శేషగిరిరావు, రిటైర్డు ఎంఈఓ శ్రీ. కె విశ్వమోహన్, ఏపిఎం అమరేశ్వరరావు , ఈవోపిఆర్‌డి ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలో స్థానిక ఎస్సీ కాలనీలో డ్రైయినేజీ నిర్మాణం పనులకు సర్పంచ్ పందిపాటి ఇందిర శంఖుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేనిరాజా,సిహెచ్‌సి డైరెక్టర్ గరికపాటి రవికిషోర్, వార్డ్ మెంబర్ ప్రవీణ్, ఎస్సీ సెల్ కార్యదర్శి పంది పాటి సుధాకర్, నేతలు కాకుళ్ళ సుధాకర్,కామేశ్వరరావు, కార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.



కుక్క కాటుకు గురైన మహిళను పరామర్శిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

వీధి కుక్కలను నియంత్రించండి

గాయపడిన కార్మికురాలికి కార్పొరేటర్ పరామర్శ

ప్రజాశక్తి - భవానీపురం : వైఎస్ఆర్ కాలనీలో వీధి కుక్కల దాడిలో గాయపడిన కార్మికురాలిని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ వీధీ కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత విఎంసి అధికారులపై ఉందన్నారు. వీధి కుక్కల నుండి ప్రజల ప్రాణాల్ని కాపాడాలని సత్యబాబు డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ కాలనీ కమిటీ నాయకులు కె రవి, ఎం. దుర్గా, బుజ్జి, యోహాన్, అప్పారావు తదితరులు పరామర్శించారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి - భవానీపురం :

కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు విస్తరిస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. అజిత్ సింగ్ నగర్ స్వర్గీయ కళ్ళే లలిత వీధిలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి , జయదుర్గ, మేఘవాణి పాల్గొని కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు పాల్గొని పేదలకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్ళే నాగేశ్వరరావు మాట్లాడుతూ కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా గత 34 నెలలు నుండి పేదలకు సింగ్‌నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు, డైరెక్టర్ కళ్ళే సీతా మహాలక్ష్మి, జయదుర్గా, మేఘవాణి, ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్, జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గంధం సుబ్బారావుకు నివాళి

ప్రజాశక్తి - విస్సన్నపేట :


విస్సన్నపేట మండలం స్థానిక బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ విస్సన్నపేట మండల కమిటీ మాజీ ప్రెసిడెంట్ గంధం సుబ్బారావు బుధవారం సాయంత్రం బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందారు. ఆయనకు భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. విషయం తెలుసుకున్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు విస్సంపల్లి నాగరాజు, సిఐటియు మండల కమిటీ ప్రెసిడెంట్ ఆకుల శ్రీనివాసరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు మేకల జ్ఞానరత్నం యూనియన్ గౌరవాధ్యక్షులు గంజినబోయిన రాము సగ్గుర్తి శ్రీనివాసరావు తాపీ వర్కర్స్ యూనియన్ విసన్నపేట మండల అధ్యక్షులు అప్పారావు సిఐటియు మండల కార్యదర్శి షేక్ బాషా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పి.సత్యనారాయణ యూనియన్ నాయకులు పోతురాజు, శ్రీనివాసరావు యూనియన్ గౌరవాధ్యక్షులు ఆకుల సత్యనారాయణ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గంధం సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కొండ భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం రాఘవాపురం గ్రామ రెవెన్యూ సదస్సు సందర్భంగా రాఘవపురం గ్రామంలో గత 15 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న కొండ పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని. రెవెన్యూ అధికారులకి వ్యక్తిగతంగా అర్జీలు అందజేశారు. అడంగుల్లో పేరు నమోదు చేయాలని అందరూ ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా భూమి లేని పేదలు కొండ పోరంబోకు సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు మారిన పేదల పట్టాలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. అధికారులు చర్యలు తీసుకొని ప్రభుత్వం 15 సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటున్న పేదల భూములకు పట్టాలివ్వాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్, రాఘవపురం సర్పంచ్ పెసరమిల్లి సురేష్, సిపిఎం రాఘవాపురం శాఖ కార్యదర్శి రఘు, విఠాలరావు, మహిళలు పాల్గొన్నారు.



రాఘవాపురం గ్రామ రెవెన్యూ సదస్సులో వినతిపత్రం అందజేస్తున్న పేదలబ్ధిదారులు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ నియోజకవర్గంలో 25 మంది బాధితులకు ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం కాకానీ నగర్ కార్యాలయంలో సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆపరేషన్, వైద్య ఖర్చుల నిమిత్తం సిఎం చంద్రబాబునాయుడు మంజూరు చేసిన రూ.20,56,562 ల చెక్కులను 25 మందికి పంపిణీ చేశారు. చందర్లపాడు, నందిగామ, కంచికచర్ల, వీరులపాడు మండలాలతో పాటు పట్టణ పార్టీకి చెందిన నేతలు పాల్గొన్నారు.

11 హైటెన్షన్ టవర్లు వద్దు... 4 టవర్లు చాలు...



జక్కంపూడి పాముల కాలువ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో పోతిన వెంకట మహేష్

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ రూరల్ జక్కంపూడి – పాముల కాలువ ప్రాంతాలలో రైతుల పొలాల్లో నూతనంగా 11 హైటెన్షన్ టవర్లు నిర్మించాల్సిన అవసరం లేదని, నాలుగు టవర్లు నిర్మించి, మిగతా టవర్లు ఎత్తు పెంచితే సరిపోతుందని, అలా చేయకుండా రైతుల పొలాలు నాశనం చేయటం సరికాదని వైసిపి రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్ తెలిపారు. గురువారం పాముల కాలువ వద్ద రైతులతో కలిసి పోతిన వెంకట మహేష్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జక్కపూడి, పాముల కాలువ ప్రాంతాల్లోని పొలాల్లో హైటెన్షన్ టవర్లు నిర్మిస్తున్నట్లు ఏ రైతు పొలం పోతుందో కనీసం అధికారులు నోటిఫికేషన్ లేదా పేపర్ ప్రకటన ఇవ్వకుండా 90 శాతం పనులు పూర్తి చేయటం దారుణమన్నారు. 11 హైటెన్షన్ టవర్ స్తంభాలు కాకుండా 4 స్తంభాలు సరిపోతాయని తెలిపారు. కావాలని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. రైతుల మీద కూటమి ప్రభుత్వం ఒత్తిడి తీసుకొని వస్తోందన్నారు. కలెక్టర్ రైతులతో కమిటీ వేయాలి, చర్చించి నిర్ణయం తీసుకోవాలని పోతిన వెంకట మహేష్ విజ్ఞప్తి చేశారు. రైతులు, ప్లాట్ యజమానులకు చంద్రబాబు న్యాయం చేయాలని కోరారు. పనులు అన్ని నిలుపుదల చేయాలని, రైతులకు న్యాయం చేయకుంటే నిరసన గళం విప్పుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు శిరిపురపు సాంబశివరావు, నిమ్మగడ్డ జోగేశ్వరరావు, మాతంగి ఆంజనేయులు, ఆలూరి వెంకట సత్యనారాయణ, కొంపెల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వత్సవాయి :

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన స్థానిక మునేరు అవతల చోటు చేసుకుంది. చింతల గ్రామానికి చెందిన అంగజాల వెంకట్రావు ద్విచక్ర వాహనంపై పెనుగంచిప్రోలు వైపు నుంచి వెళ్తూ వరదలతో మార్జిన్ కొట్టుకుపోయి ఏర్పడిన గోతిలో పడిపోయాడు. ప్రమాదంలో వాహనం స్తంభాన్ని ఢీకొనడంతో పెద్ద ప్రమాదం తప్పింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. తక్షణమే తోట పక్కన మార్జిన్ పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - తిరువూరు : హెల్మెట్ ధరించి బైక్ నడిపితే అనుకోకుండా జరిగే రోడ్డు ప్రమాదాల నుండి సురక్షితంగా బయటపడ వచ్చని ఎస్ఐ సత్యనారాయణ వాహన దారులకు సూచించారు. తిరువూరు బోసుబొమ్మ సెంటర్లో హెల్మెట్ ఉపయోగాలపై వాహనదారులకు గురువారం అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా బైక్ నడుపుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎంతో మంది మృతి చెందారని చెప్పారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించి మీ కుటుంబానికి మీరు బాధ్యతగా ఉండాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి డ్రైవింగ్ చేయాలని, మైనర్లకు బైకులు ఇవ్వకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ ఐ లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సత్యనారాయణ

సుంకర వర్ధంతి

ప్రజాశక్తి - తిరువూరు : ఆరు దశాబ్దాల పాటు తిరువూరు తాలూకాలో జమీందారీ వ్యతిరేక, రైతాంగ ఉద్యమ నిర్మాణంలో ఎనలేని కృషి చేసిన కమ్యూనిస్టు ఉద్యమ నేత సుంకర వీరభద్రరావు అని సిపిఐ ఉమ్మడి కృష్ణాజిల్లా మాజీ కార్యదర్శి పసుపులేటి వెంకయ్య అన్నారు. సిపిఐ తిరువూరు కార్యాలయంలో గురువారం వీరభద్రరావు 34వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం నిర్వహించారు. కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తో కలిసి సుంకర వీరభద్రరావు చిత్రపటానికి వెంకయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్ పాల్గొన్నారు.



గ్రామసభలో చర్చిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పనులు, వేతనాల చెల్లింపులపై చర్చ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామంలో సర్పంచ్ మామిడి కుటుంబరావు అధ్యక్షతన గురువారం గ్రామ సభ జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులు, వేతనాలు చెల్లింపులపై చర్చ జరిగినట్లు ఎపిఒ మున్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిటర్ లీలా కృష్ణ, పంచాయతీ కార్యదర్శి తేనె నరేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ రామారావు, ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు


విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని గండ్రాయి గ్రామం గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆత్మ వారి సౌజన్యంతో హెర్బల్స్‌లో విలువ ఆధారిత ఉత్పత్తులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన్ కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రం శాస్త్రవేత డాక్టర్ ఆర్.ప్రభావతి కరివేపాకు పొడి, సుండిపిండి మరియు గోరింటాకు పొడి ఇవి ప్రస్తుత పరిస్థితుల్లో కమర్షియల్‌గా ఎంతో ప్రాధన్యత సంతరించుకొంది. వీటిని తయారు చేయడం వల్ల యువత, మహిళలు కొంత ఆదాయాన్ని సమాకుర్చుకోవచ్చని తెలిపారు. ఈ ఉత్పత్తులకు మార్కెట్లో చాలా డిమాండ్ ఉండటం ఒక చక్కటి కుటిరా పరిశ్రమగా స్వీకరించవచ్చని తెలిపారు.

పాఠశాలకు దాత సహకారం

ప్రజాశక్తి - తిరువూరు :

తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నిర్మాణంలో ఉన్న సైకిల్ షెడ్‌కు మరొక దాత రూ.10 వేలు విరాళం ఇచ్చారు. ప్రముఖ శ్రీకష్ణ ట్యుటోరియల్స్ కరెస్పాండెంట్ ఎం.శేషు మాస్టర్ ఈ మొత్తాన్ని గురువారం ఉపాధ్యాయులకు అందజేసినట్లు ప్రధానో పాధ్యా యురాలు కె.శ్రీలక్ష్మి తెలిపారు. జాబిల్లి ఆస్పత్రి డాక్టర్లు కొడాలి శ్రీనివాస బహుదూర్ సుజాత దంపతులు కూడా రూ.10 వేలు విరాళం ఇచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న దాత

గన్నవరం విమానాశ్రయ నిర్మాణంలో

నిర్బంధ పనిపై కమ్యూనిస్టుల పోరాటం

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

ప్రపంచ వింతల్లో ఒకటిగా చెప్పుకునే తాజ్‌మహాల్ నిర్మాణానికి రాళ్లేత్తిన కూలీలెవరని ప్రశ్నించాడు మహాకవి శ్రీశ్రీ. అమరావతికి అనుసంధానంగా వున్న గన్నవరం విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని నేటి పాలకులు ప్రచారం హోరెత్తిస్తారు. తొలినాళ్లలో దీని నిర్మాణంలో చెమట చుక్కలు చిందించిన రైతు, శ్రామికుల గురించి, న్యాయమైన కూలి కోసం కమ్యూనిస్టుల నాయకత్వంలో వారు జరిపిన పోరాటాన్ని నేటి తరం తెలుసుకోవాలి. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు సిపిఎం కృష్ణాజిల్లా మహాసభల చల్లపల్లిలో జరగనున్న సందర్భంగా ఆ పోరాటాన్ని మననం చేసుకుందాం.

1945లో యుద్ధ అవసరాల నిమిత్తం బ్రిటీష్ ప్రభుత్వం గన్నవరంలో విమానాశ్రయ నిర్మాణాన్ని ప్రారంభించింది. చుట్టుపక్కల 68 గ్రామాల్లోని రైతులు తమ ఎండ్ల బండ్లను తెచ్చి విమానాశ్రయ నిర్మాణంలో



పనిచేయాలని "భారత రక్షణ చట్టం" కింద నిర్బంధంగా ఆదేశించింది. ఆ పని కాంట్రాక్టర్లు గ్యానన్ డంకర్లీ కింద పనిచేయాలనీ, వారిచ్చిన కూలి తీసుకోవాలనీ అధికారులు నిర్దేశించారు. ఆనాడు రైతు సంఘం నాయకత్వాన కామ్రేడ్స్ చింతపల్లి పాపారావు, అట్లూరి శ్రీమన్నారాయణ, ముక్కామల నాగభూషణం, తుమ్మల వెంకట సుబ్బయ్య, కాట్రగడ్డ పెద వెంకట్రాయుడు, పెండ్యాల వెంకటేశ్వరరావు తదితర నేతల నేతృత్వంలో తాలూకాలోని 68 గ్రామాల రైతాంగాన్ని ఎడ్లబండ్లతోసహా పార్టీ సమీకరించింది. కేసరపల్లి నుంచి ఆత్కూరు వరకూ.. బాహుబలేంద్రుని గూడెం (బిబిగూడెం) నుంచి బుద్ధవరం వరకూ.. రోడ్లపై ఎడ్ల బండ్లు నిలబెట్టి రైతులంతా విమానాశ్రయం వద్ద ఉన్న జిల్లా కలెక్టరు వద్దకెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. రైతుల సంఘీభావం చూసిన ఆయన రైతులకు న్యాయమైన కూలిరేటును ఇవ్వవలసిందిగా బ్రిటీషు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆ విధంగా రైతుల పోరాటం విజయవంతమైంది. రాష్ట్ర విభజన అనంతరం అమరావతిని రాజధానిగా ప్రకటించారు. దీనికి అనుసంధానంగా ఉన్న గన్నవరం విమానాశ్రయ విస్తరణకు సమీప గ్రామాల్లో భూ సేకరణ చేశారు. 2015-19 మధ్య విమానాశ్రయ విస్తరణ భూసేకరణ సమయంలోనూ సిపిఎం రైతులకు అండగా నిలిచింది. ఎర్ర జెండా తన ఒరవడిని కొనసాగించింది.

రేషన్ షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు నగరపంచాయతీ, మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్ షాప్ డీలర్ల పోస్టులకు ఆర్డీవో హెలా షారోన్. బి. ఎస్.నోటిఫికేషన్ విడుదల చేశారు. పట్టణంలో 7వ వార్డు షాపు బిసి -ఏ మహిళ, 3, 6 వార్డుల్లో దుకాణాలకు మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్(జనరల్)కు, 16వ వార్డులో షాపుకు బీసీ-ఏ, 13, 14 వార్డుల్లో షాపులకు ఎస్టీ మహిళలు, 10, 12 వా ర్డుల్లో షాపులకు బీసీ-బీ మహిళలు, చినఓగిరాల షాపుకు ఈడబ్ల్యుఎస్, ముదునూరు షాపుకు బీసీ-డీ మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తికల, అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాలని, అభ్యర్థులకు ఈనెల 29వ తేదీన ఉయ్యూరు జడ్పీఉన్నత పాఠశాలలో రాతపరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎలీప్‌లో యువతకు శిక్షణ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం సూరంపల్లి ఎలీప్ ఇండస్ట్రీయల్లో యువతీ,యువకులకు వ్యవసాయ వ్యాపార రంగాల్లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏసీఏబీసీ ట్రైనింగ్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ శోభారాణి గురువారం తెలిపారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం సంస్థ సహకారంతో ఎలీప్, సీఈడీ ఆధ్వర్యంలో అగ్రి క్లినిక్ స్థాపించేందుకు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. అగ్రికల్చర్, హార్టీకల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయోటెక్నాలజీ, అగ్రి ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, వుడ్ అండ్ న్యూట్రిషన్, బిజడ్సీ, హెరీమ్ సైన్స్, ఎన్విరాన్మెంట్ సైన్స్ పై పోర్ట్ గ్రాడ్యుయేషన్, గ్రాడ్యుయేషన్, డిప్లొమో చదివిన పట్టభద్రులకు మాత్రమే ఈ అవకాశం ఉందన్నారు. వ్యవసాయ అనుబంధ వ్యాపార ఉత్పత్తులు, అవగాహన, నిర్వాహణ, బ్యాంకింగ్ రంగం ద్వారా లభించే రుణ సదుపాయాలు, డిటేయిల్ ప్రాజెక్టు రిపోర్టు, మార్కెటింగ్ టెక్నిక్యూస్ వంటి అంశాలా 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, భోజన వసతి కూడా ఉచితంగా కల్పిస్తామని శోభారాణి తెలిపారు. శిక్షణకు ఈ నెల 23 నుంచి అప్లికేషన్ తీసుకోవటం ప్రారంభం అవుతుందని, శిక్షణ పూర్తయిన తరువాత ధృవీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. ఇతర వివరాలకు 94412-66769 నెంబరు సంప్రదించాలని కోరారు.

వైద్య శాఖలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వారి ఆదేశానుసారం ,జిల్లా కలెక్టర్ డి .కె. బాలాజీ అనుమతితో నేషనల్ హెల్త్ మిషన్ లో ఖాళీల భర్తీ కొరకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతా బాయి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.జనరల్ ఫిజీషియన్ లేదా మెడికల్ ఆఫీసర్ 1పోస్టు, స్టాఫ్ నర్స్ 5 పోస్టులు , డిఇఐసి మానేజర్ 2 పోస్టులు , ఆడియోలోజిస్ట్ మరియు స్పీచ్ లాంగ్వేజ్ పతలజిస్ట్ - 1పోస్టుల సంబంధించిన మొత్తం 9 పోస్టులు కష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో భర్తీ చేయునున్నట్లు తెలిపారు. నోటిఫికేషన్, దరఖాస్తు ఫారం ను కష్ణ డాట్ ఎన్ ఐ సి డాట్ ఇన్ లో ఉంచామన్నారు.. పూర్తిచేసిన దరఖాస్తును జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం మచిలీపట్నంలో ఈ నెల 17 తేదీ సాయంకాలం ఐదు గంటలు లోపు అందజేయాలన్నారు.



కెయూలో ఉద్యోగులకు కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : బోధనేతర సిబ్బందిలో నైపుణ్యం పెంచేందుకే కంప్యూటర్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. రెండు రోజులుగా విశ్వవిద్యాలయ బోధనేతర సిబ్బంది కి నిర్వహి స్తున్న కంప్యూటర్ శిక్షణా తరగతులు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంకేతిక పరమైన అంశాల్లో ఎప్పటికప్పుడు పనితీరును మెరుగు పరుచుకోవడానికి ఇటువంటి శిక్షణా తరగతులు అవసరమన్నారు.ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ డీన్ ఆచార్య సుందర కృష్ణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కుమారి పాల్గొన్నారు.

17న ఉయ్యూరులో జాబ్‌మేళా

ప్రజాశక్తి ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పన శాఖ, డిఆర్డిఎ సిడాప్, ఎన్ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిం చుటకు ఈనెల 17న ఉయ్యూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, నైపుణ్యాభివద్ధి అధికారి పి. నరేష్ కుమార్ గురువారం ఓసంయు క్త ప్రకటనలో తెలిపారు. బస్ స్టాండ్ సమీపాన శ్రీలంక కాలనీలో ఎన్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాలో బజాజ్ క్యాపిటల్, మెడిస్ హెల్త్ సర్వీసెస్, గూగుల్ పే వంటి ప్రముఖ కంపెనీలవారు పాల్గొంటారని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫా ర్మసీ పూర్తిచేసి 18 నుండి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు షుమారు రూ. 12 వేల నుండి రూ.20వేల వరకు పని అనుభవాన్ని బట్టి వేతనముతో పాటు ఇతర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

యుటిఎఫ్ కృషి ప్రశంసనీయం : డిఇఒ



మోడల్ పేపర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : విద్యార్థుల ఉత్తమ ఫలితాలు సాధన కొరకు యుటిఎఫ్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి పి వి జె రామారావు కొనియాడారు. ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించే మోడల్ పేపర్లను కష్ణాజిల్లా డీఈవో పివిజే రామారావుతో కలిసి జిల్లా విద్యాశాఖాధి కార్యాలయంలో కృష్ణా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండి షౌకత్ హుస్సేన్, బి కనకారావు రాష్ట్ర కార్యదర్శి కె ఉమా మహేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు జై లెనిన్ బాబు జిల్లా కార్యదర్శి రాజా శ్రీధర్, ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు కార్యవర్గ సభ్యులు కె రంగనాథ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కొరకు మాత్రమే కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల శ్రేయస్సును కూడా దష్టిలో ఉంచుకొని ప్రతి ఏడాది మోడల్ టెస్ట్ పేపర్లను రూపొందించి విద్యార్థులకు అందించడం ప్రశంసనీయం అన్నారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయ ఆధ్వర్యంలో రూపొందించబడి అతి తక్కువ ధరకు తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు ఉండే విధంగా వందరోజుల ప్రణాళికకు అనుకూలంగా తయారు చేసి అందించడం జరుగుతుంది. ప్రతి ఏడాది మోడల్ పేపర్ నుంచి 70 నుంచి 80 మార్కులు ప్రశ్నలు వస్తున్నాయని మోడల్ పేపర్ గ్రామీణ విద్యార్థుల శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుంద న్నారు.

14 న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అదేశాను సారం ఈ నెల 14 తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కష్ణా,ఎన్టీఆర్ జిల్లాలు మరియు ఏలూరు జిల్లాలోని నూజివీడు, మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు మరియు మొవ్వ కైకలూరు కోర్టుల పరిధిలో ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లైములు మరియు అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకొనవచ్చన్నారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద కిషోరి వికాసం కార్యక్రమంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పి శేషు కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లింగ వివక్షత, నైపుణ్యం, ఉపాధి, ఆత్మరక్షణ, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, మానవ అక్రమ రవాణా, లైంగిక వేధింపుల నుండి రక్షణ, బాల్యవివాహాలు అరికట్టడం, వ్యక్తిగత రుతు స్రావ, పరిశుభ్రత, మొదలగు అంశాలపై ఏఎన్ఎంలు అంగన్వాడీ టీచర్లు ఉపాధ్యాయులు మహిళా పోలీసులు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీ ఎం శ్రీనివాసరావు, న్యాయవాది శైలజ వన్ స్టాఫ్ సెంటర్ ప్రతినిధి సునీత(టి ఓ టి) లు పాల్గొని శిక్షణ ఇచ్చారు

రమణకు సత్కారం

ప్రజాశక్తి-ఉయ్యూరు : జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జీవీ రమణను రోటరీ, ఇన్నర్ వీల్ క్లబ్బుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు సుబ్రమణ్యం. జిల్లా క్లబ్ ప్రతినిధులు సంపత్కుమార్, సయ్యద్దనీస్, కార్యదర్శి మీర్ బాష, మాజీ అధక్షురాలు శ్యామలాదేవి, ఇన్నర్వీల్ క్లబ్ సభ్యులు సూర్యకుమారి, ఉప్పాల పద్మ, మాధురీ రాణి తదితరులు రమణ దంపతులకు పుష్పగుచ్చాలు అందచేసి సత్కరించారు.

పేద విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి - గుడివాడ : రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడచే పేద విద్యార్థికి రూ.21వేలు వితరణగా అందజేశారు. గురువారం స్థానిక రోటరీక్లబ్ అఫ్ గుడివాడ కార్యాలయంలో విజయవాడలోని సిద్ధార్థ మహిళా కళాశాలలో ఇంటర్ చదువుతున్న తండ్రిలేని ఎన్.నవ్యశ్రీ పేద విద్యార్థికి రూ.21వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు టి.ఎన్.రాజశేఖర్, కార్యదర్శి జి.కిరణ్‌బాబు, ట్రెజరర్ నరహరిశెట్టి ప్రసాద్, క్లబ్ సభ్యులు ఎ.సుబ్ర హ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయాలు, స్వీపర్లకు వేతనాలు చెల్లించాలి



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు ఇతర పాఠశాలల్లో పని చేస్తున్న ఆయాలు స్వీపర్లకు తక్షణమే వేతనాలు చెల్లించాలని వైసిపి అభిమాని బడే గౌతం విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారికి నెలసరి కనీస వేతనం రూ 6000 కూటమి ప్రభుత్వం వచ్చిన నాటినుండి సరిగా ఇవ్వకపోవడం చాలా బాధాకరమన్నారు. కరోనా లాంటి విపత్కర సమయంలో కూడా వారి నెలవారి వేతనాలు వారికి క్రమం తప్పకుండా ఇచ్చి గత ప్రభుత్వం వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆదుకుందన్నారు.కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నెలల తరబడి వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తూ ఉండటంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలని గౌతం కోరారు.

గ్రంథాలయంలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - మైలవరం : కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవి కుమార్ మైలవరం శాఖ గ్రంథాల యాన్ని గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇతనిఖీలో భాగంగా గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పనితీరు గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు కోయ సుధా, గ్రంథాలయ సిబ్బంది సయ్యద్ అహ్మద్, రాంబాబు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



రోడ్డు మార్జిన్లలో బడ్డీకొట్లు, ఫ్లెక్సీ బోర్డులు తొలగించాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణ ప్రధాన రహదారులు, కూడళ్లు కోదాడరోడ్, విజయవాడ రోడ్, బలుసుపాడురోడ్, ముక్త్యాలరోడ్, అన్ని ప్రధాన రోడ్లు కూడళ్ళలో పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా రోడ్ మార్జిన్లలో ఉన్న ఆక్రమణలు తొలగంచాలని పట్టణ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. బడ్డీకోట్లు, ఫ్లెక్సీ బోర్డులు, ప్రకటన స్టాండ్లు, రోడ్ డివైడర్లు, కూడళ్లలో ఉన్న అనధికార ఫ్లెక్సీలు తొలిగించేందుకు జగ్గయ్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీస్ విభాగం, పురపాలక సంఘం వారు నిర్ణయించారు. పట్టణంలో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలను, ఫ్లెక్సీలను స్వచ్ఛందంగా ఈ నెల 14 లోపు తొలగించుకోవాలని ఆదేశించారు. తొలిగించని పక్షంలో జగ్గయ్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీస్, పట్టణ పురపాలక సంఘం వారు సంయుక్తంగా తొలగిస్తారని దానివల్ల వచ్చే నష్టాన్ని ఆక్రమణదారులే భరించుకోవాని మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్ రావు తెలిపారు.

ఐఎఎస్ ప్రాథమిక అంశాల పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - విస్సన్నపేట : ఎంఎల్‌సి లక్ష్మణరావు చే రాయబడిన ఐఎఎస్ ప్రాథమిక అంశాలు అనే పుస్తకాన్ని విస్సన్నపేట ఎమ్‌డిఒ చిన రాట్నాలు గురువారం ఆవిష్కరిం చారు. ఈ పుస్తకాన్ని మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అందజేయనున్నట్లు యుటిఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బిసిహెచ్.సూర్యనారాయణ విసన్న పేట మండలం యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్. చంటి బాబు ఎ మురళీకృష్ణ కె.రంగ ఈ నాగేశ్వరరావు కె.రాజశేఖర్ వి.వెంకటేశ్వరరావు జి.చంద్రశేఖర్, డి.రాంబాబు, బివి.రామారావు, సిహెచ్.లక్ష్మయ్య, యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ రామారావుపై దాడి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : మాజీ కార్పొరేటర్ నాగోతి రామారావుపై జరిగిన దాడి ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు చిట్టినగర్, కెఎల్ రావు నగర్‌లో నాగోతి రామారావు కుటుంబం నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. 47వ డివిజన్ టిడిపి అధ్యక్షులుగా ఉన్నారు. గతంలో కార్పొరేటర్‌గా కూడా పనిచేశారు. అయితే ఈనెల 11వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో బండారు లక్ష్మణరావు అనే వ్యక్తితో డివిజన్ పార్టీ ఆఫీసులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం గురించి మాట్లాడుకుంటున్నారు. హఠాత్తుగా అక్కడికి విజయ్, వాళ్ళ స్నేహితుడు నిమ్మల కార్తీక్ అనే అతను బండిపై వచ్చి పదునైన ఆయుధంతో నాగోతి రామారావు ఎడమ కంటిపైన, తలపైన దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కళ్లు తిరిగి పడిపోయాడు. బంగారు లక్ష్మణ్ సహాయంతో ఆసుపత్రికి వెళ్తుండగా అదే వీధిలో మయూరీ టీ స్టాల్ దగ్గర మరలా విజయ్ నాపరాయి తీసుకుని వెనుక కుడి భుజంపై బలంగా కొట్టి పారిపోయాడు. పాత గొడవల దృష్ట్యా విజయ్‌అనే వ్యక్తి అతని స్నేహితుడు కార్తీక్‌తో కలిసి పథకం ప్రకారం తనను చంపాలనే ఉద్దేశ్యంలో తనపై దాడి చేశారని నాగోతి రామారావు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - వీరులపాడు : మండల పరిధిలోని చెన్నారావు పాలెం గ్రామపంచాయతీ శివారు గ్రామం అటవీ భూముల మధ్య ఉన్న తిమ్మాపురం గ్రామ మహిళలు తాగునీటి కోసం అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయారు. దీంతో గురువారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. తాగటానికి గుక్కెడు మంచినీరు గ్రామానికి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరారు. గ్రామంలో సుమారు 100 కుటుంబాల వారు నివసిస్తున్నారు. ఈ గ్రామం కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ఆనుకొని ఉంటుంది. ఈ గ్రామంలో అందరూ వ్యవసాయ కూలీలు. గడచిన 20 సంవత్సరాల నుంచి ఈ గ్రామంలో తాగునీరు లేక బోరు పంపు నీరే తాగుతున్నామని దీని కారణంగా గ్రామంలో అనేకమంది కీళ్ళ నొప్పులు, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. ఎన్నికల సమయంలో నాయకులు తమ గ్రామం వచ్చి ఓట్లను అభ్యర్థిస్తున్నారు తప్ప గ్రామంలో నివసిస్తున్న తమకు తాగునీరు వచ్చేలా ఎటువంటి చర్యలు



తీసుకోలేదని వారు పేర్కొంటున్నారు. తమ గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా అర్జీలు అందించినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తాగునీరు వచ్చేలా చూడాలని మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నేత్రాలు దానం

ప్రజాశక్తి - గంపలగూడెం : గంపల గూడెం గ్రామానికి చెందిన గార్లపాటి సుబ్బారావు (80) గురువారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తిరువూరు లైన్స్ క్లబ్ ప్రతినిధి



గోగిరెడ్డి కృష్ణారెడ్డి నేత్రాల దానానికి కుటుంబ సభ్యులను ఒప్పించారు. విజయవాడకు చెందిన ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు నేత్రాలు స్వీకరించారు. దీనితో మరో నలుగురికి కంటి చూపు రానుంది.

13న సిపిఎం మండల మహాసభ

ప్రజాశక్తి - గంపలగూడెం : ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం భారత కమ్యూనిస్టు పార్టీ, (మార్క్సిస్టు) గంపలగూడెం మండల 8వ మహాసభ జరగనున్నట్లు మండల కార్యదర్శి గువ్వల సీతారామిరెడ్డి తెలిపారు. ఈ మహాసభ వీరాంజనేయ మ్యాంగో మార్కెట్ తోటమూలలో జరుగుతున్నట్లు వివరించారు. మండల వ్యాప్తంగా ఉన్న కార్యకర్తలు, పార్టీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీతారామిరెడ్డి కోరారు.

కొండ ప్రాంత ఇళ్ళ పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలి

రెవెన్యూ సదస్సులు నిర్వహించిన గాంధీజీ స్కూల్ వద్ద సిపిఎం ధర్నా

ప్రజాశక్తి - వన్‌టౌన్ : విజయవాడ పశ్చిమ మండలం పరిధిలోని పది కొండ ప్రాంతాలు, 12 డివిజన్ల మైదాన ప్రాంతాల్లో వున్న సుమారు 40 వేల కుటుంబాల వారి ఇళ్ళ పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం వన్‌టౌన్ గాంధీజీ నగరపాలక సంస్థ పాఠశాలలో పశ్చిమ మండల రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పాఠశాల బయట సిపిఎం పశ్చిమ సిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం బోయి సత్యబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను గుట్టు చప్పుడు గాకుండా, పబ్లిసిటీ లేకుండా నిర్వహించటం వల్ల ప్రయోజనం లేదన్నారు. అంతేగాక గురువారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని చెప్పిన అధికారులు 10.30 గంటలు అయినా ఏ ఒక్క అధికారి రాకపోవటం అంటే ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతోందన్నారు. రెవెన్యూ సదస్సులు ఇలా గాకుండా సచివాలయాల వద్ద నిర్వహిస్తే మరిన్ని సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. కొండ ప్రాంత వాసుల ఇళ్ళ పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయకపోవడం వల్ల బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారని, దీంతో అధిక వడ్డీలకు గురవుతున్నారని వాపోయారు. పశ్చిమ నియోజకవర్గంలో వున్న కొండ ప్రాంత డివిజన్లు 38, 44,



రెవెన్యూ సదస్సు జరిగే చోట చేస్తున్న ధర్నాలో సిపిఎం నాయకులు బోయి సత్యబాబు, గాదె ఆదిలక్ష్మి తదితరులు

45, 46, 48, 49, 51, 51, 52, 55ల నివాస గృహాలకు పట్టాలు మంజూరు చేసి రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. ఎప్పుడు నిర్మించి వదిలేసిన టిడ్కో ఇళ్ళను అప్పులు చేసి డబ్బులు కట్టిన వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం ఇస్తామన్న రెండు సెంట్ల భూమిని ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఫించన్లు ఇవ్వాలని కోరుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు న్యాయం చేయాలని పశ్చిమ డెప్యూటీ తహశీల్దార్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాజీ కార్పొరేటర్ గాదె ఆదిలక్ష్మి, నాయకులు కె. సూరిబాబు, ఎస్. సుబ్బారెడ్డి, పలువురు ముఠా కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులపై మేస్త్రి వేధింపులు ఆపాలని వినతి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ 44 డివిజన్ శానిటేషన్ కార్మికులపై లీడ్ శానిటరీ మేస్త్రిగా పనిచేస్తున్న ప్రకృతి శ్రీనివాస్ తీవ్ర వేధింపులు చేయటాన్ని నివారించాలని కోరుతూ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ 44వ డివిజన్‌లోని శానిటరీ మేస్త్రి శ్రీను కార్మికుల వేతనాల నుండి ప్రతి నెల, ప్రతి కార్మికుడికి రూ.1500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఒక వేళ ఇవ్వడానికి



వినతిపత్రం ఇస్తున్న సత్యబాబు, తదితరులు

నిరాకరించిన కార్మికులపై తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. తన డివిజన్‌లోని రామరాజ్యనగర్, విద్యాధరపురంలో పనిచేస్తున్న కార్మికులను వేరే డివిజన్‌కి బదిలీ చేస్తూ, తన పక్క డివిజన్లో పనిచేస్తున్న వారిని 44వ డివిజన్‌కు నియమించుకుంటూ కార్మికులను తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అన్నారు. తన మాట వినని మహిళా కార్మికులకు ఫోన్ చేసి దురుసుగా దుర్భాషలాడుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దీనిపై ఇన్‌ఛార్జి సిఎంఒహెచ్ డాక్టర్‌సురేష్‌బాబు స్పందిస్తూ సదరు లీడ్ మేస్త్రి అరాచకాలు, అవినీతిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి, తగిన చర్యలు తీసుకోనున్నట్లు హామీనిచ్చారు.



మంత్రి కొల్లుకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ మత్రి నెట్టెం రఘురాం శు క్రవారం కొల్లు రవీంద్ర నివాసానికి వెళ్లి రవీంద్రని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ రాష్ట్ర పరిశీలకులు గింజుపల్లి రమేష్, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి తాళ్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ప్రజాశక్తి - మైలవరం : స్థానిక లక్కి రెడ్డి అనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ కేంద్రం ద్వారా ఉచితంగా ఇచ్చే శిక్షణకు ఈనెల 16 లోగా దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇళ్ల రవి, గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డొమెస్టిక్ బయోమెట్రిక్ డాటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు సంబంధించి మూడు నెలల పాటు ఉచితంగా నిర్వహించే శిక్షణకు పది, ఆపై చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8247766718 నంబర్ను సంప్రదించాలని సూచించారు.

సభ్యత్వ నమోదులో ఎంఎల్ఎ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో కాకాని నగర్, గాంధీ బొమ్మ సెంటర్లో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గురువారం ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో సభ్యత్వము రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం ఎంఎల్ఎ శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఏర్పడిన టిడిపిలో ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకొని భాగస్వామ్యం కావాలని కేవలం రూ.100 తో సభ్యత్వం తీసుకోవడం ద్వారా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.10 వేలు మట్టి ఖర్చులకు, రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉంటుందన్నారు.

రెడ్డిగూడెంలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం రెడ్డిగూడెం గ్రామంలో సర్పంచ్ మల్లాది రాణి అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రైతులు, తహశీల్దార్ జె.సుశీలదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య విఆర్‌ఒ జానీ, వివిధ శాఖల అధికారులులు హాజరయ్యారు. పట్టాదారు పాసుపుస్తకాలకు 1 అర్జీలు సర్వే కొరకు 5 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ సుశీలదేవి తెలిపారు.

ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాశక్తి - గుడివాడ : ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా డి పండు, టి నాగేంద్రలు ఎన్నికైనట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం పేర్కొన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గుడివాడ మండల మహాసభ స్థానిక సుందరయ్య భవనంలో నాగేంద్ర అధ్యక్షతన గురువారం జరిగింది. తొలుత గుడివాడ మండలం మహాసభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం కలిగిన ఎస్ఎఫ్ఐ జెండాని అధ్యక్షుడు నాగేంద్ర ఎగం వేశారు. అనంతరం వివిధ ప్రజా సంఘలు నుండి అమరులైన నాయకులకు, ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా కార్యదర్శిగా పనిచేసిన సీతారం ఏచూరికి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డికి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ప్రేమ్ కుమార్ తండ్రి ఈడే శ్రీనివాసరావుకి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, ఎస్.సమరంలు ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల మహాసభ ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యారంగ సంస్థలు పరిష్కరించాలని, నాడు-నేడు పనులు త్వరగా




పూర్తి చేయాలని, కష్ణా యూనివర్సిటీ హాస్టల్‌ని త్వరగా పూర్తిచేసే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని, అద్దె భవనాల్లో ఉన్న హాస్టల్ విద్యార్థులకు సొంత భవనాలు కేటాయించాలని, మహిళలపై అత్యాచారాలు నిరోధించాలని, కార్పొరేట్ విద్యా విధానాన్ని అరికట్టాలని కోరారు. అనంతరం ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల అధ్యక్షులుగా డి.పండు, కార్యదర్శిగా టి నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా జోషి బాబు, జి.కౌశిక్, ఎం.ప్రేమ్ చంద్, సహాయ కార్యదర్శిలుగా శైలుష, చిన్ను, ప్రవీణ్, సత్తార్, 9 మంది ఆఫీస్ బేరర్స్‌గా వీరితోపాటు ఏడుగురు కమిటీ సభ్యులుగా కలిపి మొత్తం 16 మంది ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సలీమ్, ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ హారిక, జిల్లా కమిటీ సభ్యురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సిసి రోడ్ల నిర్మాణం



ప్రజాశక్తి-పమిడిముక్కల : మండలంలో అన్ని గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామని పమిడి ముక్కల పంచాయతీరాజ్ ఏఈ సిహెచ్ పృద్విరాజ్ అన్నారు. గురువారం పమిడి ముక్కల మండలంలోని ఎండిఓ కార్యాలయంలో ఆయన మాటాడుతూ పమిడిముక్కల, లంకపల్లి, తాడంకి, కృష్ణాపురం గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టామని, అందులో 68 పూర్తయ్యాయన్నారు. మరి కొన్ని చోట్ల పనులు జరుగుతున్నాయన్నారు.రోడ్ల నిర్మా ణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని, స్థానిక ఎంఎల్ఎ వర్ల కుమార్‌రాజా సహాయ సహకారాలతో వేగంగా రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చల్లపల్లి : స్థానిక నర్రా రమాదేవి సాయిబాబు లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ విఆర్‌కె నగర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడ మెడ్ స్టార్ హాస్పిటల్స్ సహకారంతో చీఫ్ ఇంటర్వెన్షల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.విజయ చైతన్య పర్యవేక్షణలో వైద్యులు బి.హేమేశ్వరరావు (న్యూరాలజిస్ట్), ఆర్.నాగచంద్ర (కార్డియాలజిస్ట్)లు శిబిరంలో వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో ఈసీజీ, 2డి ఎకో-గుండె స్కానింగ్ ఆర్‌బిఎస్ పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్సులు రాయపాటి రాధాకష్ణ, కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, నర్రా సాయిబాబు, కొల్లిపర మధు, మోపిదేవి వెంకటేశ్వరరావు, కంఠంనేని సుధాకరరావు, ఎంవి.కష్ణారావు పాల్గొని పర్యవేక్షించారు.

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలోని మోదుమూడి, అశ్వరావుపాలెం, వేకనూరు గ్రామాల సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల అధికారులతో తాసిల్దార్ కే నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా అధికారులు నిర్వహించవలసిన కర్తవ్యాలపై అవగాహన కల్పించారు, ఈ సమావేశంలో ఇరిగేషన్ డి ఈ పి వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి ఈవోపీఆర్డి ఏ అరుణ కుమారి, వ్యవసాయ శాఖ అధికారి శౌరమ్మ పాల్గొన్నారు.
ప్రజాశక్తి-కోడూరు : ఈనెల 14వ తేదీన నీటి సంఘాలకు సంబంధించి ఎన్నికలు జరగనున్నాయని తాసిల్దార్ శీను నాయక్ తెలిపారు. గురువారం కోడూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులు, నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నియమితులైన పోలింగ్ అధికారులతో శిక్షణ తరగతులు నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి రాందాస్, ఎంపీడీవో సుధా ప్రవీణ్, ఈఓపిఆర్డి రాజనాల నాగ రేవతి,వ్యవసాయ శాఖ అధికారి ఎం శ్రీధర్ పాల్గొన్నారు.
ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : నీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని మండల తాసిల్దార్ లోకరాజు తెలిపారు. ఈనెల 14వ తేదీన జరుగు నీటి సంఘాల ఎన్నికల్లో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించే సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల నిర్వహణ విధి విధానాలను ఆయన వివరించారు. ఎంఈఓ 1జి.జగన్మోహనరావు, ఎంఈఓ 2 జి గోపాల రావు, ఆర్ ఐ శివకుమార్ పాల్గొన్నారు.
ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలంలోని 21 నీటి వినియోగ సంఘాలకు, 168 ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యుల ఎన్నికల ప్రకటన విడుదలైనట్లు తహసీల్దార్ వెంకటశివయ్య తెలిపారు. ప్రకటన పత్రాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయం, పీఏ సీఎస్ లతో పాటు అన్ని ప్రభుత్వ జడ్పీ పాఠశాలలు, నీటి పారుదల కార్యాలయాలు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న ప్రాదేశిక నియోజకవర్గంలోని రైతులందరూ ఉదయం 8 గంటలకు ఎన్నికలు జరిగే ప్రదేశాలకు వెళ్లి నామినేషన్ దాఖలు చేయాలన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సభ్యుల ఎన్నిక పూర్తవుతుందన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-మోపిదేవి : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు సకాలంలో పరిష్కరిస్తామని తాసిల్దార్ మేడపాటి శ్రీవిద్య అన్నారు. మోపిదేవి మండలంలోని పెదప్రోలు గ్రామపంచాయతీ పరిధిలోని కప్తానుపాలెం రెవిన్యూ పరిధికి సంబంధించి గ్రామ సచివాలయం కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్పంచ్ పోలిమెట్ల యేసుబాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు రైతులు తమకు గల భూ సంబంధిత సమస్యలను వినతి పత్రాల రూపంలో తాసిల్దార్ శ్రీవిద్య, మండల సర్వేయర్ రామకష్ణ లకు అందించారు. కప్తానుపాలెంలో నూతనంగా గత ప్రభుత్వంలో నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్ ను రైతులకు అందుబాటులోనికి తీసుకురావాలని గ్రామానికి చెందిన ప్రముఖులు, రైతు కేశాని సురేష్ బాబు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. దేవాదాయ శాఖ సూపర్నెండెంట్ బొప్పన సత్యనారాయణ, గ్రామ సచివాలయ సర్వేయర్ రాజు, తెలుగుదేశం పార్టీ నాయకులు డోకిపర్తి బాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.
ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని మంటాడ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 16 అర్జీలు అందాయని తహసీల్దార్ నవీన్‌కుమార్ అన్నారు. మంటాడ గ్రామ సర్పంచ్ నందమూరి వీరమ్మ, ఎం.ఆర్.ఐ కిరణ్ కుమార్, ఏసుపాదం పాల్గొన్నారు.
ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఉప్పలూరు గ్రామంలో నిర్వహించిన సదస్సులో గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సిపిఎం నాయకులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో ఆర్ అండ్ బి, పంచాయతీ రోడ్లు పూర్తిగా పాడైపో యాయని, గ్రామంలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేక మురుగు చేరి దోమలు కారణంగా గ్రామాల్లోని ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారని, అలాగే ఆర్ అండ్ బి రోడ్డు రైల్వే గేటు వద్ద నుండి గవర్నమెంట్ హాస్పిటల్ వరకు ఆక్రమణకు గురికాబడిన కారణంగా వాహనదారుల ఇబ్బందులు పడుతున్నారని, గతంలో నడిపిన బస్సు సర్వీసు 141 బస్సును నడపాలని వినతిపత్రం అందించారు సిపిఎం కంకిపాడు మండల కమిటీ సభ్యుడు మంచాల చిట్టిబాబు, సిపిఎం నాయకులు వి రెడ్డయ్య, కలపాల మురళీ పాల్గొన్నారు.

మంత్రి కొల్లుకు పలువురు పరామర్శ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ హఠాన్మరణం చెందడంతో మంత్రి రవీంద్రను ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. గురువారం ఆయన మచిలీపట్నంలోని మంత్రి సోదరుడి ఇంటి వద్దకు వెళ్లి వెంకటరమణ భౌతిక్కాయంపై పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం రవీంద్రను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ చంద్ర, బర్మా శ్రీనివాసరావు, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.
ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకట రమణ హఠాన్మరణంపై ఉమ్మడి కష్ణా జిల్లా టీడీపీ నేతలు సంతాపం తెలిపారు. మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర ఇంటివద్ద కొల్లు వెంకట రమణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ ప్రస్తుత ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, పెడన ఎమ్మెల్యే కాగిత కష్ణ ప్రసాద్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్



వెంకటరమణ భౌతికాయానికి నివాళులర్పిస్తున్న వికుర్తి శ్రీనివాసరావు

రాజా, మాజీ మంత్రి దేవినేని ఉమా, గుడివాడమాజీ ఎమ్మెల్యే మరియు ఏపీ వేర్ హౌసింగ్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు. మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకష్ణ తదితరులు మంత్రి కొల్లు రవీంద్ర ఇంటికి వచ్చి తమ సంతాపం తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి నవమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 13 నుంచి నుంచి 16 వరకు వరకు జరగనున్నాయి. అత్యంత వైభవోపేతంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకొని తరించాల్సిందిగా భక్తులను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పీ వీ కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు కోరారు. ఈ నాలుగు రోజులపాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు పీ వీరారెడ్డి, విజయలక్ష్మి, కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయభాస్కరమ్మ దంపతులు తెలిపారు.


అనాథ చిన్నారులకు పింఛన్లు ఇవ్వడం పట్ల హర్షం



ప్రజాశక్తి-కంకిపాడు : సంక్షేమ పాలనకు చిరునామా తెలుగుదేశం పార్టీ అని కంకిపాడుకు చెందిన ప్రముఖ సోషల్ వర్కర్, మండల సీనియర్ టిడిపి నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇరువురిని కోల్పోయిన చిన్నారులకు కూడా ఫించన్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించడమే శుభపరిణామమని అన్నారు. కరోనా మహమ్మారి వలన వేలాది మంది చిన్నారులు తల్లిదండ్రులు ఇరువురుని కోల్పోయి, అనాథలుగా మిగిలి, ఇతరుల దయాదాక్షిణ్యాల మీద ఆధార పడిన దైన్యం నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిల్లో కూటమి ప్రభుత్వం అందజేయనున్న ఫించను సొమ్ము ఆయా చిన్నారులు గౌరవప్రదంగా జీవించడానికి దోహదం చేస్తుందని అన్నారు.

సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : దైవ స్వరూపి సహవాసం వారి సారథ్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మండలంలోని నార్త్ వల్లూరులో పాస్టర్ వల్లూరు సలోమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమీ క్రిస్మస్ వేడుకలకు మద్రాస్ నుంచి వచ్చిన దైవ స్వరూపి సహవాసం బిషప్ దేవరపల్లి దానియేలు ముఖ్య అతిధిగా పాల్గొని క్రీస్తు సందేశాన్ని వివరించారు. పాస్టర్ వల్లూరు శాలెం, తదితర క్రీస్తు బోధకులు పాల్గొని క్రిస్మస్ కేకులు కట్ చేశారు.



మత్స్యకారులకు వేటసామాగ్రి అందజేత

ప్రజాశక్తి-నాగాయలంక : వేటపై ఆధారపడి జీవించే కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కషి చేస్తున్నట్లు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం నాగాయలంక శ్రీరామ పాద క్షేత్రం ఫుడ్ కోర్టు వద్ద కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన 80 నిరుపేద మత్స్యకార కుటుంబాల వారికి నాబార్డ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఫండ్స్ (టీడీఎఫ్) ద్వారా ప్రజా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.50 లక్షలు విలువైన పడవలు, ఐస్ బాక్సులు, వేట సామాగ్రి అందచేశారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని యానాది కాలనీలకు సీసీ రోడ్లు మంజూరు చేసి నిర్మిస్తున్నట్లు తెలిపారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేయిస్తామన్నారు. ఇప్పటికీ ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్లు లేని వారి జాబితా తనకు అందిస్తే అధికారులతో మాట్లాడి వాటిని సమకూర్చుతామన్నారు.

హెచ్‌సిఎల్ టెక్ బి ప్రోగ్రాం కోసం దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రముఖ అంతర్జాతీయ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్ టెక్, తమ టెక్ బీ ప్రోగ్రాం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సంస్థ రీజనల్ ఇంఛార్జి కె.అజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తరగతి తరువాత విద్యార్థులు తమ కెరీర్లను ప్రారంభించే దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఈ ప్రోగ్రాం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హెచ్‌సిఎల్ టెక్‌తో 12 నెలల శిక్షణ పొందుతారని, విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారికి కంపెనీతో ఫుల్‌టైమ్ ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన సంస్థలైన బిట్స్ పిలాని, ఐఐటీ కొట్టాయం, శస్త్ర, అమిటీ యూనివర్శిటీ వంటి సంస్థల నుండి ఆన్లైన్ ద్వారా పార్ట్‌టైమ్‌లో ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. వివరాలకు హెచ్‌సిఎల్ కంపెనీ వెబ్ సైట్‌లో గాని లేదా ఎం.జీ.రోడ్డు కార్యాలయంలో గాని సంప్రదించవచ్చని తెలిపారు.

14న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ – చైతన్య ఆర్థో కేర్ హాస్పిటల్స్ సహకారంతో ఈ నెల 14వ తేదీన, విస్సన్నపేట చైతన్య ఆర్థో కేర్ హాస్పిటల్స్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రమేష్ బాబు ఒకే ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో గుండె వ్యాధులు, మెదడు, నరాల వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధుల వైద్య నిపుణులు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అందుబాటులో ఉంటారని అన్నారు. బ్లడ్ షుగర్, ఈ.సీ.జీ,ఎకో గుండె స్కానింగ్, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. వివరాలకు చైతన్య ఆర్థో కేర్ హాస్పిటల్‌లో సంప్రదించాలని కోరారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - వత్సవాయి : అకారణంగా తొలగించిన మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు మండల కార్యదర్శి బి.రాము కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల్ని ఆ కారణంగా తొలగించడం చాలా దారుణమన్నారు మధ్యాహ్నం భోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్న చంద్రగిరి లక్ష్మీనారాయణ, చంద్రగిరి సరస్వతి, చంద్రగిరి నరసమ్మ, చల్ల నాగమణి కార్మికులను టిడిపి ప్రభుత్వం వచ్చాక రాజకీయ దురుద్దేశంతో తొలగించారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిందని తమ వారిని పెట్టుకుంటామని తొలగించడం దారుణన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తిరిగి తీసుకోకుంటే ఆమరణ దీక్షకు సిద్ధమని అన్నారు.

బాధితులకు దేవినేని ఉమా పరామర్శ

ప్రజాశక్తి - నందిగామ :

నందిగామ నియోజకవర్గం వీరులపాడు మండలం గోకరాజుపల్లి గ్రామంలో గురువారం తోటకూర రంగారావు కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల రంగా భార్య మాధవి మరణించగా గురువారం గోకరాజు పల్లిలో వారి స్వగృహంలో పార్టీ నేతలతో కలిసి ఆమె చిత్రపటానికి నివాళులర్పించిన దేవినేని ఉమ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

29న శారదా కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు

- శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ



మాట్లాడుతున్న రామనారాయణ, తదితరులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : శారద కళాశాల 1974లో ప్రారంభమై 2024 నాటికి 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 29న స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ తెలిపారు. ఈ విషయమై గురువారం ఉదయం సత్యనారాయణపురంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వర్ణోత్సవ వేడుకలు సందర్భంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశం ఏర్పాటుతో పూర్వ విద్యార్థులు ఒకరితో ఒకరు, సంస్థతో మళ్లీ కనెక్ట్ అవ్వడానికి, నెట్‌వర్క్‌ను పెంపొందించుకోవడానికి దోహదపడతాయని తెలిపారు. పున:కలయికను రూపొందించడం ఎంతో కష్టమైన పని అయినప్పటికీ దానివల్ల కలిగే ప్రయోజనాలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో శారదా కళాశాలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా ప్రస్తుత, భవిష్యత్తు విద్యార్థులకు అందుబాటులో ఉన్న సపోర్ట్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేస్తుందన్నారు. గాంధీనగర్‌లోని శారదా కళాశాలలో చైతన్యవంతమైన స్ఫూర్తిని, సృజనాత్మకతను ప్రదర్శించే చైతన్యవంతమైన, పండుగ వాతావరణాన్ని జోడించి, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థుల ప్రదర్శనలతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వర శర్మ, హెచ్‌వోడీలు, అధ్యాపకులతో పాటు, శారదా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, ఫ్యాకల్టీ మరియు శారదా ఇంగ్లీషు మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎ.ఎల్.ఎన్.మూర్తి, సిబ్బంది ఈ సమావేశానికి హాజరై స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహణపై చర్చించారు. విలేకరుల సమవేశంలో కళాశాల పూర్వ విద్యార్థులు విజయ్‌కుమార్, మారుతి ప్రసన్న, పూర్వ విద్యార్థుల కన్వీనర్ డాక్టర్ డి.కైలాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



ప్రజాశక్తి - నందిగామ : నందిగామ గాంధీ సెంటర్‌లో జిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు, మిత్ర బందం తదితరులు భారీగా పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సయ్యద్ మజారుద్దీన్, రుద్ర తిరుపతిరావు మాట్లాడుతూ నందిగామ పట్టణంలో ప్రారంభించిన షాపింగ్ మాల్ విజయవాడ షాపింగ్ మాల్ రేట్లకే అమ్మకాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మెన్స్ వేర్, కిడ్స్ వేర్, లేడీస్ రెడీమేడ్ అండ్ శారీస్, అన్ని రకాల వస్త్రాలపై, రెడీమేడ్ ఐటమ్స్ పై అప్ టు 20 శాతం డిస్కౌంటు అందజేస్తున్నట్లు, బ్రాండెడ్ బట్టలు అమ్మకాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు సరికొత్త వెరైటీ అప్డేట్ మోడల్స్, వివాహ శుభ కార్యాలకు, పండుగలకు సరికొత్త నూతన వెరైటీస్‌తో హోల్‌సేల్ ధరలకే జిఎంఆర్ షాపింగ్ మాల్‌లో లభిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్టీ బ్రాండ్ రెడీమేడ్ షోరూమ్ అధినేత డాక్టర్ పఠాన్ గులాం గౌస్, నిర్వాహకుల కుటుంబ సభ్యులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ

నందిగామ డివిజన్లో 6 డిసిలు, 75 సంఘాలు

ప్రజాశక్తి - నందిగామ : నీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. నందిగామ డివిజన్ పరిధిలో ఆరు డిసిలు, 75 సంఘాలు ఉన్నాయి. నీటి సంఘాల పరిదిలో 758 టిసిలు ఉన్నాయని ఆర్‌డిఒ కె.బాలకృష్ణ పేర్కొన్నారు. నవంబర్ 14వ తేదీన నీటి సంఘాల టిసిలు అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తారు. అనంతరం నీటి సంఘాల అద్యక్షులు17వ తేదీన డిస్ట్రిబ్యూటరీ కమిటీలను ఎన్నుకుంటారని తెలిపారు. ఎన్నిక జరగకుండా సాధ్యమైనంత వరకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరగటానికి ప్రయత్నం జరుగుతుంది. ఏకాభిప్రాయం కుదరకపోతే రహస్య ఓటింగ్ పద్ధతిలో ఎన్నికలుంటాయి.

మండలాల వారీగా నీటి సంఘాలు

నందిగామ మండలం డిసి 1, నీటి సంఘాలు 9, టిసిలు 106, చందర్లపాడు మండలం డి సి 1, నీటి సంఘాలు 8, టిసిలు 96, జగ్గయ్యపేట మండలం డి సి1, నీటి సంఘాలు 14, టిసిలు 113, పెనుగంచిప్రోలు మండలం డిసి లేదు. నీటి సంఘాలు 11, టిసిలు 128, వీరులపాడు మండలం డి సి 1, నీటి సంఘాలు 15, టిసిలు 138, కంచికచర్ల మండలం డి సి 1, నీటి సంఘాలు 9, టిసిలు 138 వున్నాయి.

జాతీయస్థాయి వాలీబాల్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నీతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ డీమ్డ్ టు బి యూనివర్శిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంలో నాదేళ్ల బసవపూర్ణయ్య (ఎంబీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ గురువారం సాయంత్రం ప్రారంభమైంది. విజయవాడ తూర్పు ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్‌తో కలిసి ఈ పోటీలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. జాతీయ స్థాయి పోటీలతో విజయవాడ ఖ్యాతిని దేశానికి చాటుతున్న ఎంబీపీ ట్రస్ట్ ప్రతినిధులను ఆయన అభినందించారు. రాష్ట్రంలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన క్రీడాపాలసీ క్రీడా లోకం ప్రశంసలు అందుకుందని గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను నిర్మించేందుకు, 2027 జాతీయ క్రీడలను రాష్ట్రంలో నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఎంఎల్ఎ గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ క్రీడలకు పుట్టినిల్లన్నారు. ఎంబీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీ మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్శిటీ, తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ, జేఈపీఏఐఆర్



యూనివర్శిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ యూనివర్శిటీ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని, దేశ వ్యాప్తంగా టాప్ ప్లేస్‌లో ఉన్న 80 శాతం వాలీబాల్ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని విజేతలకు రూ.2.75 లక్షల నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యా సంస్థల అధ్యక్షులు పి.నాగేశ్వరరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, కళాశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, అర్జున అవార్డీ ఎ.రమణరావు, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) డెప్యూటీ డైరక్టర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గోపీచంద్, కష్ణాజిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు, ఎన్‌బీపీ ట్రస్ట్ సభ్యులు నాదెళ్ల జాహ్నవి, మోనికారావు, డాక్టర్ దేవేంద్రరాజా పాల్గొన్నారు.

ఒకే వేదికపై లలితా సహస్ర గళార్చన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : శ్రీ కళా రంజని స్కూల్ ఆఫ్ మ్యూజిక్, కళా రంజని చారిటబుల్ ట్రస్టు స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 2024 ఏప్రిల్ 27న చెన్నైలో లలితా సహస్ర గళార్చన జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ జటా శ్రీను బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సంగీత విద్వాంసులు, శ్రావ్యంగా పాడే వారు రావచ్చని తెలిపారు. ఒకే వేదికపై సుమారు వెయ్యి మందితో కర్ణాటక సంగీతం జరిపించనున్నట్లు తెలిపారు. వివరాలకు డాక్టర్ జటా శ్రీను బాబు, శ్రీ కళా రంజని చారిటబుల్ ట్రస్ట్, చెన్నైలో సంప్రదిం చాలని కోరారు. వివరాలకు 7569990822లో వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని ఉక్కు కళావేదికలో గురువారం డిస్ట్రిక్ట్ ట్రెజరీ అండ్ ఆడిట్ ఆఫీసర్ డిటిఎఒ ఎ.రవి, రిటైర్డ్ ఉద్యోగస్తులతో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగ్గయ్యపేట ఎస్‌టిఒ ప్రఫుల్ల కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో నందిగామ ఎస్‌టిఒ నాగేశ్వరరావు, ఎస్‌టిఒ సతీష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రవి మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల గురించి, ఎస్ టి వో ఆఫీస్, డిటిఒ ఆఫీస్, వారు అందిస్తున్న సేవలు తెలిపారు. లోటుపాట్లు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. స్టేట్ ప్రెసిడెంట్ ధరణి కోట వెంకటరమణ, జగ్గయ్యపేట యూనిట్ ప్రెసిడెంట్ దారా వినోద్ బాబు, సెక్రటరీ తిరుపతయ్య, ట్రెజరర్ ముత్యాలరావు, వైస్ ప్రెసిడెంట్‌లు కే పూర్ణచంద్రరావు, మరియ దాసు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీవరత్నం పాల్గొన్నారు.